క్లుప్తంగా

జెడ్పీటీసీ కుటుంబానికి సీఎం రిలీఫ్ ఫండ్



జెడ్పీటీసీ అప్పలనర్సకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే గణేష్

నర్సీపట్నం: నాతవరం జెడ్పీటీసీ కాపారపు అప్పలనర్స కుటుంబానికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ.4 లక్షలు మంజూరైంది. ఆమె భర్త వెంకటరమణ ఇటీవల గుండెపోటుతో మరణించారు. దళిత కుటుంబానికి చెందిన అప్పలనర్స ఆర్థికంగా దీనస్థితిలో ఉండటంతో సీఎం రిలీఫ్ ఫండ్‌కు దరఖాస్తు చేశారు. ఈ మేరకు నిధులు మంజూరు కావడంతో స్థానిక క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ ఆమెకు చెక్కు అందజేశారు.

లాభసాటిగా ప్రకృతి వ్యవసాయం

మాడుగుల: ప్రకృతి వ్యవసాయం ద్వారా తక్కువ పెట్టుబడులతో అధిక దిగుబడులు, లాభాలు వస్తాయని డీఎల్ఎంపీ ఆర్.వి. స్వామినాయుడు తెలిపారు. వీరనారాయణంలో పంట కోత ప్రయోగంపై రైతులకు ఆయన అవగాహన కల్పించారు. రసాయన ఎరువులతో పండించిన వరి చేలుకు, కషాయాలు, జీవామృతాలతో పండించిన పంటలకు వ్యత్యాసాలు వివరించారు. అనంతరం వరి పంటకోత ప్రయోగాలపై అవగాహన కల్పించారు. మండలంలో పది పంటకోత ప్రయోగాలు లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. కార్యక్రమంలో పంట కోత శిక్షకుడు నాగేశ్వరరావు, మండల యాంకర్ గండి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

130 మందికి దుప్పట్లు, చీరల పంపిణీ



పేదలకు దుస్తులు అందజేస్తున్న సర్పంచ్ ప్రసాద్

మాకవరపాలెం: సత్యసాయిబాబా జన్మదినం సందర్భంగా తూటిపాలలో గురువారం మధ్యాహ్నం సత్యసాయి సేవా సంఘం ఆధ్వర్యంలో అన్నసమారాధన ఏర్పాటు చేశారు. అదే రోజు రాత్రికి 130 మంది పేదలకు చీరలు, దుప్పట్లను సర్పంచ్ గవిరెడ్డి ప్రసాదరావు పంపిణీ చేశారు. వీటిని గవిరెడ్డి సూకరాజు మాస్టారు కుమారులు బుచ్చియ్యనాయుడు, సన్యాసినాయుడు సమకూర్చారు. సేవా సంఘం సభ్యులు బండారు సత్యనారాయణ, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి భూమిపూజ



భూమి పూజలో కె.జె.పురం గ్రామస్తులు

మాడుగుల రూరల్: కె.జె.పురంలో తాచేరు నది ఒడ్డున విజయ కనకదుర్గ ఆలయ నిర్మాణానికి గురువారం ఉదయం గ్రామస్తులు భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. ఈ ఆలయ నిర్మాణానికి సంబంధించి తొమ్మిది మంది దంపతుల ఆధ్వర్యంలో శాస్త్రోకంగా పూజలు చేశారు. ఆలయ నిర్మాణానికి పలువురు దాతలు భారీ విరాళాలు ప్రకటించారు.

ఆకట్టుకున్న మ్యాజిక్ ప్రదర్శన



ప్రదర్శనిస్తున్న మెజీషియన్ శ్రీరాములు

నర్సీపట్నం: వేములపూడి, నర్సీపట్నం కారుణ్య హైస్కూల్‌లో జేవీవీ సీనియర్ మెజీషియన్ శ్రీరాములు మ్యాజిక్ ప్రదర్శన చేసి విద్యార్థులను ఆలోచింపజేశారు. వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.త్రిమూర్తులరెడ్డి మాట్లాడుతూ విద్యావంతులు సైతం మూఢనమ్మకాల బారిన పడి మోసపోతున్నారని వాపోయారు. సైన్సు తెలుసుకోవడం, ఆచరించడం ఎత్తయి తే శాస్త్రీయ దృక్పథం కలిగి ఉండటం మరో ఎత్తు అన్నారు. 1,100 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

రైతన్నకు అండ

ఎహే.. రైతు భరోసా కేంద్రం సూపరే... రైతులకు వ్యయ ప్రయాసలు లేకుండా వారి స్వగ్రామంలోనే సేవలందిస్తోంది. దీనికి ముందు ఒకసారి గత టీడీపీ పాలనలోకి వెళ్తే... విత్తనాల కోసం మండల కేంద్రాల్లో అర్ధరాత్రి నుంచే పడిగాపులు.. చివరికి విత్తనాలు దొరక్క ధర్నాలు.. రాస్తారోకోలు... పోలీసుల లాఠీదెబ్బలు.. వెరసి దళారులకు పండగలా ఉండేది. గత్యంతరం లేక డీలర్లను ఆశ్రయిస్తే నకిలీ విత్తనాలు అంటగట్టడంతో లబోదిబోమనేవారు. ప్రస్తుతం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుణ్యమా అని ఆ కష్టాలన్నీ మాయమయ్యాయి.



నాపేరు బొత్స వెంకట స్వామినాయుడు.. మా ఊరు నాతవరం మండలం మర్రిపాలెం. నాకు మూడెకరాల భూమి ఉంది. గతంలో ఖరీఫ్ సీజన్‌లో వరి విత్తనాలు కావాలంటే మండల కేంద్రానికి వెళ్లేవాళ్లం. మూణ్నాలుగు రోజులు తిరిగితే గానీ అందేవికావు. అది కూడా ఉదయం నుంచి సాయంత్రం వరకు క్యూలో నిరీక్షణ చేస్తే అతి కష్టమ్మీద అందేవి. మధ్యలో విత్తనాలు అయిపోయాయని అధికారులు చెప్పిన సందర్భాలు ఉన్నాయి. దాంతో ప్రస్తుత కాకినాడ జిల్లా కోటనందూరు మండలంలో తెచ్చుకునేవాడిని. కొన్నిసార్లు రైతుల వద్ద విత్తనాలు కొనుగోలు చేసి వరి నారు పోసుకునేవాడిని. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేసిన దగ్గర్నుంచి ఎలాంటి కష్టాలు లేకుండా కావలసిన రకం విత్తనాలు గ్రామంలోనే ఆర్బీకేలో ఇస్తున్నారు. చాలా ఆనందంగా ఉంది



ఆర్బీకేలో రైతులకు విత్తనాలు పంపిణీ చేస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు(ఫైల్)



నాతవరంలో నిర్మించిన రైతు భరోసా కేంద్రం

నాతవరం: వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులకు సాగు కష్టాలు తగ్గాయి. వైఎస్సార్ రైతు భరోసా కేంద్రాల ఏర్పాటుతో అన్ని సేవలూ గ్రామంలోనే అందుబాటులోకి వచ్చాయి. మండల, జిల్లా కేంద్రాలకు వెళ్లే ప్రయాస తప్పింది. మండలంలో నాతవరం, చెర్లోపాలెం, శృంగవరం, పెదగొలుగొండపేట, వైడీపేట గ్రామాల్లో ఆర్బీకేలు వినియోగంలో ఉన్నాయి.

మరో రెండు పంచాయతీల్లో ప్రారంభించేందుకు సిద్ధంగా ఉన్నాయి. మిగతా గ్రామాల్లో భవనాల పనులు వివిధ దశల్లో ముమ్మరంగా సాగుతున్నాయి.

ఆర్బీకే ద్వారా రైతులకు అందించే సేవలు..

- రైతు భరోసా పథకంలో పెట్టుబడి కింద ఆర్థిక సాయం
- పీఎం కిసాన్
- నాణ్యమైన విత్తనాలు, ఎరువుల పంపిణీ
- పంట నమోదు, ఈకేవైసీ, ధ్రువీకరణ పత్రాల జారీ
- విత్తన పరీక్షలు
- మట్టి నమూనా పరీక్షలు
- క్షేత్ర సందర్శన
- సీహెచ్‌సీ (కస్టమ్ హైరింగ్ సెంటరు) వ్యవసాయ యాంత్రీకరణలో భాగంగా సబ్సిడీపై యంత్రాలు, పనిముట్లు పంపిణీ
- దిగుబడి అంచనా కోసం పంట కోత ప్రయోగం
- చిరు పంట ప్రదర్శన
- సున్నా వడ్డీ పంట రుణాలు
- పొలంబడి, గ్రామీణా ఉత్పత్తి పథకం
- ఎప్పటికప్పుడు ఆర్బీకే ద్వారా శాస్త్రవేత్తలతో రైతులకు సలహాలు, సూచనలు టీవీల ద్వారా అందించుట
- రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ, ఉచిత బీమా వంటి పథకాలు వర్తింపు
- ప్రతి నెలా మొదట శుక్రవారం వ్యవసాయ సలహా మండలి సమావేశం ఏర్పాటు చేసి రైతుల నుంచి సలహాలు సూచనలు తీసుకొని సమస్యలు పరిష్కరించుట

- స్వగ్రామంలో వ్యవసాయ సేవలు
- సకాలంలో విత్తనాలు, ఇతర పరికరాల పంపిణీ
- రైతులకు తగ్గిన వ్యయప్రయాసలు





ఆర్బీకేలో కియోస్క్ ద్వారా రైతులకు సేవలు

నాతవరం మండలం

మొత్తం రైతు భరోసా కేంద్రాలు : 16
ఒకో భవన నిర్మాణానికి నిధులు కేటాయింపు రూ.23.98 లక్షలు
నిర్మాణం పూర్తి చేసుకున్న కేంద్రాలు: 7
రెవెన్యూ గ్రామాలు : 42
గ్రామ పంచాయతీలు : 31
గ్రామాలు : 78



రైతులకు అందుబాటులో ఉంటున్న సిబ్బంది

ఆర్బీకేలో అన్ని రకాలు సేవలు



తాండవ రిజర్వాయరు ఆయకట్టులో జిల్లాలోనే ఏటా ఖరీఫ్‌లో అధిక విస్తీర్ణంలో వరి సాగవుతోంది. దాంతో ఏటా మండలంలో ముందుగానే ఆర్బీకేల ద్వారా విత్తనాలు అందిస్తున్నాం. రైతులకు అవసరమైన సూచనలు, సలహాలు అందిస్తున్నాం.

– శైలజ, ఏవో, నాతవరం మండలం

అంగన్‌వాడీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు

నర్సీపట్నం/రావికమతం/కె.కోటపాడు/మాడుగుల: అంగన్‌వాడీ కేంద్రాల్లో ఖాళీ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైంది. ఈ మేరకు నర్సీపట్నం ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో మాకవరపాలెం మండలం తాడపాల, నర్సీపట్నం మండలం వేములపూడి పంచాయతీ బంగారయ్యపేట, వేములపూడి పంచాయతీ మొండికండి(కార్యకర్తలు), నర్సీపట్నం మున్సిపాలిటీ, బలిఘట్టం (సహాయకురాలు), మాకవరపాలెం మండలం బూరుగుపాలెం పంచాయతీ పైలపాడ(మినీ అంగన్‌వాడీ కార్యకర్త)లో భర్తీ చేయనున్నారు.

● రావికమతం పరిధిలో ఇదే మండలం తట్టబంద, గొల్లలపాలెం, బుచ్చెయ్యపేట మండలం పీపీ అగ్రహారం-2, నేతవానిపాలెం, ఎం.భూపతిపాలెం అంగన్‌వాడీ కేంద్రాల్లో సహాయకుల పోస్టులు ఓపెన్ కేటగిరీకి కేటాయించారు.

● కె.కోటపాడు పరిధిలో ఇదే మండలం పాడుగుపాలెం-2, దేవరాపల్లి మండలం ఎస్.ఆర్.చేనులపాలెంతోపాటు మాడుగుల పరిధిలో ఇదే మండలం ఎం.కె. వల్లాపురంలో సహాయకురాలు పోస్టు ఓసీ కేటగిరీకి కేటాయించారు. ఆయా పోస్టులకు ఈ నెల 24 నుంచి వచ్చే నెల 4వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయానికి నేరుగా దరఖాస్తులు సమర్పించాలి. పదో తరగతి ఉత్తీర్ణత పొంది, ఈ ఏడాది జూలై ఒకటో తేదీ నాటికి 21 నుంచి 35 ఏళ్లలోపు కలిగిన స్థానిక వివాహిత అభ్యర్థులు అర్హులని సీడీపీవోలు మేరీ సువార్త, ఉషారాణి, మంగతాయారు, సీహెచ్ శ్రీదేవి తెలిపారు.

చెట్టుపై నుంచి జారిపడి వ్యక్తి మృతి

కూర్మన్నపాలెం: చెట్టు కొమ్మలు తెంచేందుకు మామిడి చెట్టు ఎక్కిన వ్యక్తి జారి పడి మృతి చెందిన సంఘటన దువ్వాడ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. దువ్వాడ సీఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం.. దేవరాపల్లి మండలం వాకపల్లికి చెందిన పాట్నూరి కన్నబాబు (52) ఉపాధి కోసం వచ్చి కుటుంబంతో సహా కూర్మన్నపాలెం పరిధి భరత్‌నగర్‌లోని లక్ష్మీగణేష్ ఎన్‌క్లేవ్‌లో వాచ్‌మన్‌గా పని చేస్తున్నాడు. గురువారం మామిడి కొమ్మల కోసం దువ్వాడ విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాలకు వెళ్లే మార్గంలోని దువ్వాడ పై వంతెన సమీపంలో ఉన్న చెట్టు ఎక్కి మామిడి కొమ్మలు కోస్తుండగా పట్టు తప్పి కిందపడిపోవడంతో తలకు బలమైన గాయాలయ్యాయి. వెంటనే అతడిని 108 వాహనంలో కేజీహెచ్ తరలిస్తుండగా మార్గంలో మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమారుడు సాయికుమార్ ఫిర్యాదు మేరకు దువ్వాడ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.



మృతుడు పాట్నూరి కన్నబాబు (ఫైల్)

జనం కోసమే సీఎం జగన్

పల్లెనిద్రలో ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ

చోడవరం/మాడుగుల రూరల్/ దేవరాపల్లి/ కె.కోటపాడు/గొలుగొండ/రావికమతం/రోలుగుంట/బుచ్చెయ్యపేట/మాకవరపాలెం/చీడికాడ: ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే... కార్యక్రమంలో భాగంగా గౌరీపట్నంలో పల్లె నిద్ర కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సర్పంచ్ కోన చంద్రరావు ఆధ్వర్యంలో గురువారం రాత్రి ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ ఇక్కడ అన్ని వీధుల్లో పర్యటించారు. జనంతో మమేకమై వారి సమస్యలు తెలుసుకున్నారు. కొన్ని ఇళ్లకు వెళ్లి గ్రామ సమస్యలు, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పనితీరు, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ, అభివృద్ధి పనులపై అడిగి తెలుసుకున్నారు. సమస్యలను పరిష్కరిస్తామన్నారు. ఒకరి ఇంట్లో భోజనం చేసి అక్కడే రాత్రి బస చేశారు. ఎంపీటీసీ మంగ జగన్నాథరావు, నాయకులు పాల్గొన్నారు.

మాడుగుల మండలం ఎం. కోడూరులో వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు తాళ్లపురెడ్డి వెంకటరాజారామ్, దేవరాపల్లి మండలం తారువ, కె.కోటపాడు మండలం సింగన్నదొరపాలెంలో వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు ఈర్లె అనురాధ, ఎంపీపీ రెడ్డి జగన్‌మోహన్, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు బూరె బాబూరావు, గొలుగొండ మండలంఏఎల్‌పురం-2లో నర్సీపట్నం ఏఎంసీ చైర్మన్ చిటికెల భాస్కర నాయుడు, జెడ్పీటీసీ సుర్ల గిరిబాబు, రావికమతం మండలం జెడ్.కొత్తపట్నంలో ఎంపీపీ పైల రాజు, రోలుగుంట మండలం కుసర్లపూడిలో ఎంపీపీ యర్రంశెట్టి శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు గొర్లె వెంకట రామన్, చీడికాడ మండలం జె.బి.పురంలో ఎంపీపీ కురచా జయమ్మ ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమం నిర్వహించారు. జి.కొత్తపల్లిలో నియోజకవర్గ పరిశీలకుడు ఉరికూటి అప్పారావు పల్లెనిద్ర చేశారు. పార్టీ మండలాధ్యక్షుడు రాజుబాబు పాల్గొన్నారు. మాకవరపాలెం మండలం లచ్చన్నపాలెంలో ఎంపీపీ రుత్తల సత్యనారాయణతోపాటు ఇన్‌చార్జి ఎంపీడీవో సీతామహాలక్ష్మి సచివాలయ పరిధిలో చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరించారు.



కె.కోటపాడు: మాట్లాడుతున్న మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు అనురాధ



మాకవరపాలెం: లచ్చన్నపాలెంలో ఫ్లెక్సీని ఆవిష్కరిస్తున్న ఎంపీపీ, నేతలు



గొలుగొండ: ఏఎల్‌పురంలో జెండా ఆవిష్కరణ చేస్తున్న నాయకులు



చీడికాడ: జి.కొత్తపల్లిలో సహపంక్తి భోజనాలు చేస్తున్న నియోజకవర్గ పరిశీలకుడు అప్పారావు

బుచ్చెయ్యపేట మండలం విజయరామరాజుపేటలో గురువారం రాత్రి ఏపీకి జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి జెడ్పీటీసీ దొండా రాంబాబు హాజరయ్యారు.

హిందూ ధర్మ పరిరక్షణకు ప్రభుత్వ ప్రాధాన్యం



మాదాలమ్మ ఆలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గణేష్

నర్సీపట్నం: హిందూ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిస్తుందని ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ పేర్కొన్నారు. దుగ్గాడలో రూ.10 లక్షలతో నూతనంగా నిర్మించిన మాదాలమ్మ తల్లి ఆలయాన్ని ఆయన గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నియోజకవర్గంలో వందకుపైగా దేవాలయాల నిర్మాణానికి తిరుమల తిరుపతి దేవస్థానం నిధులు మంజూరు చేసిందన్నారు. ఎంపీపీ సుర్ల రాజేశ్వరి, సర్పంచ్ నిద్దర లలిత, నిద్దర శ్రీను, గ్రామస్తులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో కార్తీక ఏకాదశి పూజలు

మాకవరపాలెం/దేవరాపల్లి/మాడుగుల రూరల్/ బుచ్చెయ్యపేట: కార్తీక శుద్ధ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని అన్ని శివాలయాల్లో గురువారం భక్తులు పెద్ద ఎత్తున ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వేకువజాము నుంచే ఆలయ పరిసరాలల్లో ఆధ్యాత్మిక సందడి వాతావరణం నెలకొంది.

కల్యాణ మండపానికి శంకుస్థాపన

బుచ్చెయ్యపేట: దిబ్బిడిలో కల్యాణ మండప నిర్మాణానికి ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ గురువారం శంకుస్థాపన చేసి పనులను ప్రారంభించారు. పనులు త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. దీని నిర్మాణానికి టీటీడీ నుంచి రూ.10 లక్షలు మంజూరుకు కృషి చేసిన ధర్మశ్రీకి ఈ సందర్భంగా మండల నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. జెడ్పీటీసీ దొండా రాంబాబు, ఎంపీపీ దాకవరపు నాగేశ్వరదేవి, వైస్ ఎంపీపీలు గొంప చినబాబు, దొండ లలితా నారాయణమూర్తి, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి జోగా కొండబాబు, సర్పంచ్ పెదిరెడ్ల మాణిక్యం, నాయకులు గొంప అప్పారావు, సియాద్రి తాతబాబు, ముచ్చకర్ల అప్పారావు, భూషణం, రామారావు పాల్గొన్నారు.



శంకుస్థాపన చేస్తున్న ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ

29న కె.కోటపాడులో జగనన్నకు చెబుదాం

కె.కోటపాడు: స్థానిక కల్యాణ మండపంలో ఈ నెల 29న జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు మండల ప్రత్యేకాధికారి నాగలక్ష్మి, తహసీల్దార్ జె.రమేష్‌బాబు తెలిపారు. ఈ మేరకు వీరు గురువారం స్థల పరిశీలన చేశారు. అనంతరం మాట్లాడుతూ కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి, జిల్లా స్థాయి అధికారులు కార్యక్రమానికి హాజరు కానున్నారని తెలిపారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశమయ్యారు. కుల గణనను విజయవంతం చేయాలన్నారు. జెడ్పీ ఉన్నత పాఠశాలతోపాటు భవితా కేంద్రాలను మండల ప్రత్యేకాధికారి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎంపీడీవో ప్రసాద్, ఐసీడీఎస్ పీవో మంగతాయారు, ఏపీఎం వెంకటలక్ష్మి, ఏపీవో అప్పలరాజు, ఎంఈవోలు- 1, 2 సత్యనారాయణ, డీవీడీ ప్రసాద్, హెచ్ఎం పద్మావతి పాల్గొన్నారు.

ఓటర్ల జాబితాలో అవకతవకలు సహించేది లేదు

నాతవరం: ఓటర్ల జాబితాలో అవకతవకలకు పాల్పడిన బీఎల్వోలను ఇంటికే పంపిస్తామని నర్సీపట్నం ఆర్డీవో జయరాం హెచ్చరించారు. గురువారం ఆయన స్థానిక తహసీల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా సందర్శించారు. పోలింగ్ సిబ్బందితో సమావేశమై పలు సూచనలు చేశారు. నిర్లక్ష్యంగా వ్యవహరించే సిబ్బందిపై కఠిన చర్యలు ఉంటాయన్నారు. ప్రధానంగా యువ ఓటర్లను చేర్పించడంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. తహసీల్దార్ ఎస్.ఎస్.వి.శ్రీనివాస్‌నాయుడు పాల్గొన్నారు.

హిందూ ధర్మాన్ని కాపాడాలి

మాకవరపాలెం: హిందూ ధర్మాన్ని కాపాడేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని దక్షిణ భారత హిందూ మహాసభ ఆర్గనైజింగ్ కార్యదర్శి, ఓం భారతి శక్తి పీఠాధిపతి భారతానంద కోరారు. గురువారం బూరుగుపాలెంలో నిర్వహించిన హిందూ సమ్మేళనానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా భక్తులు, సమరసతా సేవా ఫౌండేషన్ సభ్యులు ఆయన్ను ర్యాలీగా తీసుకొచ్చి ఘనంగా సత్కరించారు. సంఘ ధర్మప్రచారకులు సన్యాసినాయుడు, వరహాలబాబు, బీజేపీ నేత అడిగర్ల రాంబాబు, సర్పంచ్ వెంకటరమణ పాల్గొన్నారు.



భారతానందను సత్కరిస్తున్న స్థానికులు

శిక్షణ తరగతులు ప్రారంభం

రోలుంట: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో సైన్సు టీచర్లకు ఎల్ఐపీపై రెండు రోజుల శిక్షణ తరగతులను ఎంఈవోలు జానుప్రసాద్, పి. జగ్గారావు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మంచి అభ్యసనతో గుణాత్మకమైన మార్పులు తీసుకురావాలన్నారు. కాంప్లెక్సు హెచ్ఎం వరప్రసాద్‌రావు, తదితరులు పాల్గొన్నారు.